జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

శనివారం | 15-08-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 755 పేజీలు: 4 వెల : రూ.7

# నేడు పంద్రాగస్టు వేడుకలు

* ఆర్ట్స్ కళాశాల మైదానంలో జాతీయపతాకావిష్కరణ * జెండా ఎగురవేయనున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు * స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం * పలు సాంస్కృతిక ప్రదర్శనలు * జిల్లా ప్రగతిని చూపేలా శకటాల ప్రదర్శన * ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాల పంపిణీ * ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా యంత్రాంగం

శ్రీకాకుళం, ఆగస్టు 14 (వార్త): పంద్రాగస్టు వేడుకకు జిల్లా సన్నద్ధమైంది. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం ఉదయం తొమ్మిది గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. అంతకుముందు పోలీసు పరేడ్, గౌరవ వందనాన్ని స్వీకరించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వనున్నారు. జిల్లా ప్రగతిని చూపేలా శకటాలను ఆయా శాఖలు ప్రదర్శించనున్నారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులు, అధికారులకు ప్రశంసా పత్రాలను అందజేయనున్నారు. ఈ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం పరిశీలించింది. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆర్ట్స్ కళాశాల మైదానాన్ని శుక్రవారం సందర్శించారు. పోలీసు పరేడ్ సాధన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. రిహార్సల్స్‌లో భాగంగా ముందుగా పోలీసు సిబ్బంది నుంచి జిల్లా ఎస్పీ గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కవాతు పరిశీలన వాహనంలో మైదానంలో పర్యటిస్తూ సాయుధ పోలీసు బలగాల పరేడ్ ప్రదర్శనను పరిశీలించారు. పరేడ్ నిర్వహణలో పాటించాల్సిన పలు సూచనలు, మెలకువలను సిబ్బందికి తెలియజేశారు. ఆయన వెంట అదనపు ఎస్పీలు పి. శ్రీనివాసరావు, ఎల్. శేషాద్రి, సీఐ ఈశ్వరరావు, ఆర్ఐలు శంకర్ ప్రసాద్, కె.నర్సింగరావు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.








# విద్యార్థినిపై బ్లేడుతో దాడి

* ప్రేమిస్తున్నానంటూ వేధింపులు
* ఆమె ఒప్పుకోక పోవడంతో దాడి
* గాయాలపాలైన విద్యార్థిని
* ఆసుపత్రిలో చికిత్స
* పారిపోతున్న వ్యక్తిని పట్టుకున్న స్థానికులు
* పోలీసులకు అప్పగింత

మందస, ఆగస్టు 14(వార్త): రోజురోజుకూ మహిళలపై దాడులు పెరుగుతున్నాయి.. దాడులు చేసిన వారు తామేదో ఘన కార్యం చేసినట్టు గొప్పగా ఫీల్ అవుతున్నారు.. చట్టాలు కఠినంగా ఉన్నాయి.. భయపడాల్సిన తరుణంలో కూడా కొంతమంది యువత నేరాలకు పాల్పడుతున్నారు. విచక్షణ కోల్పోయి మహిళలపై దాడులకు పాల్పడుతున్నారు. ఈ దాడులు మందస వంటి వెనుకబడిన ప్రాంతాలకు విస్తరించడం విచారకరం. వివరాలిలా ఉన్నాయి. మందస మండలానికి చెందిన ఓ విద్యార్థిని మందసలోని ఓ కళాశాలలో చదువుతోంది. ప్రతీ రోజూ బస్సులో ఆమె మందసకు రాకపోకలు సాగిస్తోంది. అయితే ఇదే మండలంలోని చికిడిగాం గ్రామానికి చెందిన ఓ యువకుడు ప్రేమ పేరుతో ఆ విద్యార్థిని కొద్ది రోజులుగా వేధిస్తున్నాడు. నిత్యం ఆమె వెంట పడుతున్నాడు. ఆమె నిరాకరించడంతో బస్సు కోసం ఎదురు చూస్తున్న విద్యార్థినిని బ్లేడుతో రెండు రోజులు కిందట దాడి చేశాడు. దీంతో ఆమె కుడి చేయికి గాయమైంది. వెంటనే ఆమెను హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం తరలించారు. దాడి చేసిన అనంతరం ద్విచక్రవాహనంపై పారిపోతున్న సమయంలో కొత్తవీధిలో కొంతమంది అతడిని పట్టుకుని మందస పోలీసులకు అప్పగించారు. ఇదిలా ఉండగా.. ఈ సంఘటనపై మందస పోలీసులకు ఇప్పటికే ఫిర్యాదు అందింది. పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితుని అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన మందస ప్రాంతంలో సంచలనం కలిగించింది.



# మాజీ మంత్రి అప్పలరాజుకు.. బెయిల్

* 23 రోజులు పాటు జైలులో ఉన్న సీదిరి
* బెయిల్ రావడంతో సంబరాలు చేసుకున్న అనుచరులు
* కక్ష గట్టి జైలుకు పంపారు
* యాక్సిడెంట్ కేసుకు.. హత్యాయత్నం కేసు ఏంటి?
* నాకు, నా కుటుంబానికి కష్టకాలం
* వైసీపీ శ్రేణులు, ప్రజలు అండగా ఉన్నారు
* మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు



పలాస, ఆగస్టు 14 (వార్త): రోడ్డు ప్రమాదం కేసులో సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలతో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత సీదిరి అప్పలరాజుకు కోర్టులో ఊరట లభించింది. సోంపేట అదనపు జిల్లా కోర్టు శుక్రవారం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. దీంతో దాదాపు మూడు వారాలుగా కొనసాగుతున్న రిమాండ్ నేపథ్యంలో ఆయనకు తాత్కాలిక ఉపశమనం లభించినట్లయింది. బెయిల్ పిటిషన్‌పై గత కొంతకాలంగా విచారణలు, వాయిదాలు కొనసాగుతున్న నేపథ్యంలో శుక్రవారం కోర్టు మరోసారి విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన అనంతరం అప్పలరాజుకు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

**ప్రమాదం కేసు.. అరెస్టు వరకు**

జులై 10న జరిగిన రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి దానయ్య మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించి అప్పలరాజు కుమారుడు ఆర్.వర్మ సిద్ధార్థ, త్యాడీలపై పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తులో సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలపై పోలీసులు అప్పలరాజును కూడా కేసులో నిందితుడిగా చేర్చారు. ఈ నేపథ్యంలో జులై 22న ఆయనను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి ఆయన అంపోలు జైలులో ఉన్నారు. 23 రోజులు పాటు ఆయన జైలులో ఉన్నారు. కేసు దర్యాప్తు, న్యాయపరమైన పరిణామాల నేపథ్యంలో అప్పలరాజు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించారు. తాజాగా కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ఆయనకు ఊరట లభించింది.

**రాజకీయంగా వేడెక్కిన వ్యవహారం**

అప్పలరాజు అరెస్టు అనంతరం ఈ కేసు రాజకీయంగానూ చర్చనీయాంశమైంది. అరెస్టును వైసీపీ నేతలు, కార్యకర్తలు తీవ్రంగా వ్యతిరేకించారు. కేసు రాజకీయ కక్షతోనే పెట్టారంటూ వారు ఆరోపిస్తూ పలాసతో పాటు టెక్కలి, ఇచ్ఛాపురం, సోంపేట ప్రాంతాల్లో నిరసనలు, రాస్తారోకోలు నిర్వహించారు. మరోవైపు, రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి, అనంతర దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన అంశాల ఆధారంగానే చట్ట ప్రకారం చర్యలు తీసుకున్నామని పోలీసుల వైపు నుంచి వాదన ఉంది. దీంతో ఈ కేసు న్యాయపరమైన అంశంతో పాటు స్థానిక రాజకీయ పరిణామాలపైనా ప్రభావం చూపింది.

**బెయిల్‌తో కార్యకర్తల్లో ఉత్సాహం**


అప్పలరాజుకు బెయిల్ మంజూరైన విషయం తెలియడంతో పలాసలో వైసీపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. పలుచోట్ల కార్యకర్తలు మిఠాయిలు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. కొందరు బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. "న్యాయం గెలిచింది అప్పలరాజు త్వరలో మన మధ్యకు వస్తున్నారు" అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఇక ఆయన విడుదల అనంతరం స్థానిక రాజకీయాల్లో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయన్నది పలాస నియోజకవర్గంలో ఆసక్తికరంగా మారింది.

**యాక్సిడెంట్ కేసుకు.. హత్యాయత్నం కేసు ఏంటి?**

శ్రీకాకుళం: బెయిల్ వచ్చిన వెంటనే జైలు నుంచి వచ్చిన వెంటనే సీదిరి అప్పలరాజు, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్‌లతో కలిసి మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం తనపై కక్ష గట్టి జైలుకు పంపించారన్నారు. సాధారణ యాక్సిడెంట్ కు హత్యాయత్నం కేసు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. నా అరెస్టు తర్వాత ప్రజలు తనను ఆదరించారన్నారు. మీ వేధింపులే మాకు వరంగా మారుతున్నాయన్నారు. వైసీపీకి మంచి రోజులు వచ్చినట్టేనన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తమ తప్పుల్ని ప్రశ్నిస్తున్న వైఎస్సార్సీపీ నేతల్ని అణచివేయాలని చూస్తోందని, తన అరెస్టు, జైలుకు పంపడం ఇందులో భాగమేనని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు స్పష్టం చేశారు. 23 రోజుల తర్వాత బెయిల్‌పై విడుదలయ్యానన్నారు. ఇది నాకు, మా కుటుంబానికి కష్టకాలమన్నారు. జిల్లాలో పార్టీ పెద్దలు ధర్మాన కృష్ణదాస్, ధర్మాన ప్రసాదరావు నన్ను ఆప్యాయంగా ఆహ్వానించి, తిరిగి కార్యకర్తలతో మమేకం అయ్యేలా చేశారన్నారు. వారితో పాటు అనుక్షణం అండగా నిలిచిన పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, కార్యకర్తలు, నేతలకు ధన్యవాదాలు తెలిపారు. మా స్థానిక స్టేషన్‌లో ఉన్న పోలీసుల నుంచి, జిల్లా స్థాయిలో ఉన్నట్లు పోలీసుల వరకు కూడా, అందరూ కూడా నాకు సాయం చేశారన్నారు. కేసు ఏంటో, అదే చేశారు. దానికి సంబంధించినట్లు సెక్షన్‌లతోనే పెట్టారుని, ఈ ప్రభుత్వం నా మీద కక్షగట్టిందన్నారు. లేకపోతే ఒక యాక్సిడెంట్‌ని హత్యాయత్నంగా కేసులు పెట్టడం దేశంలో ఎక్కడైనా చూశామా అన్నారు. ఈ కేసు కోర్టులో ఉన్నందున మాట్లాడేందుకు మరికొంత సమయం తీసుకుంటానన్నారు.

# అక్కడ చీరే.. ప్రహారీ

* జలుమూరు ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతి గృహంలో కూలిన గోడ * తాత్కాలిక రక్షణ కోసం చీరను అడ్డుగా కట్టుకున్న విద్యార్థినులు * విద్యార్థినుల భద్రతపై తల్లిదండ్రుల ఆవేదన



జలుమూరు, ఆగస్టు 14(వార్త): జలుమూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతి గృహం ప్రహరీ ఏడాది కిందట కూలిపోయింది. దీంతో విద్యార్థినుల భద్రతపై ఆందోళన నెలకొంది. విధిలేని పరిస్థితుల్లో విద్యార్థినులు తమకు రక్షణ కల్పించుకునేందుకు చీరలను అడ్డుగా ఏర్పాటు చేసుకున్నారు. వసతి గృహం చుట్టూ సరైన రక్షణ లేకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. ఏడాది కాలంగా సమస్య ఉన్నప్పటికీ అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థినుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి నూతన ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# పలాసలో హర్ ఘర్ తిరంగా హోరు

- త్రివర్ణ పతాకాలతో కదిలిన పలాస..
- దేశభక్తి నినాదాలతో

మార్మోగిన ప్రధాన రహదారులు



**పలాస, ఆగస్టు 14 (వార్త):** హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పలాసలో శుక్రవారం భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. శుక్రవారం పలాస టీడీపీ కార్యాలయం నుంచి కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ సాగింది. జాతీయ జెండాలు చేతబూని పాల్గొన్న ప్రజలు దేశభక్తి నినాదాలు చేయడంతో పలాస--కాశీబుగ్గ ప్రధాన రహదారులు మార్మోగాయి.

కాశీబుగ్గలో భారీ మానవహారంతో పాటు ర్యాలీ కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్‌కు చేరుకున్న అనంతరం భారీ మానవహారం నిర్వహించారు. జాతీయ జెండాలతో ప్రజలు ఒకే వరుసలో నిలిచి జాతీయ సమైక్యత, ఐక్యతా భావాన్ని చాటారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘన నివాళు లర్పించారు. దేశ సమైక్యతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని నాయకులు పేర్కొన్నారు.

**ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగరాలి :**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకోవడంతో పాటు యువతలో దేశభక్తి, జాతీయ భావాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

హర్ ఘర్ తిరంగా కేవలం జెండా ఎగరవేసే కార్యక్రమం మాత్రమే కాదని, దేశం పట్ల బాధ్యత, గౌరవం, దేశభక్తి భావాలను ప్రతి ఒక్కరిలో పెంపొందించే కార్యక్రమమని ఆమె పేర్కొన్నారు. జాతీయ సమైక్యత, సౌభ్రాతృత్వం, సోదరభావాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

భారీగా తరలివచ్చిన ప్రజలు, యువత, విద్యార్థులు జాతీయ జెండాలతో ర్యాలీలో పాల్గొనడంతో పలాస పట్టణం త్రివర్ణ శోభను సంతరించుకుంది. ర్యాలీకి స్థానిక ప్రజల నుంచి కూడా విశేష స్పందన లభించింది.

## ఎరువుల దుకాణంలో ఆకస్మిక తనిఖీలు

- అధిక ధరలకు విక్రయంపై ఫిర్యాదు
- శ్రీలక్ష్మీ ట్రేడర్స్ లైసెన్స్ సస్పెన్షన్



**జలుమూరు, ఆగస్టు 14(వార్త):** చల్లవానిపేటలోని ఎరువుల దుకాణంపై వ్యవసాయ శాఖ అధికారులు గురువారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ శాఖ జేడీ వై.వి.మురళీకృష్ణ, ఏడీఏ ఎల్.వెంకటమధు ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీ ట్రేడర్స్ దుకాణంలో తనిఖీలు చేపట్టారు. దుకాణంలో ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ సీఎంవో కార్యాలయానికి ఫిర్యాదు అందిన నేపథ్యంలో అధికారులు ఈ ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. దుకాణంలోని ఎరువుల నిల్వలు, విక్రయ వివరాలు, ధరలకు సంబంధించిన రికార్డులను అధికారులు పరిశీలించారు. ఫిర్యాదుపై నిర్వహించిన తనిఖీల అనంతరం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు గుర్తించి శ్రీలక్ష్మీ ట్రేడర్స్ దుకాణం లైసెన్సును సస్పెండ్ చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు. రైతులకు ఎరువులను నిర్ణీత ధరలకు మాత్రమే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. రైతులకు ఎరువుల సరఫరాలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా వ్యవసాయ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తుందని అధికారులు తెలిపారు.

## దేశభక్తి చాటిన విద్యార్థులు



**సారవకోట, ఆగస్టు 14(వార్త):** వాంద్రాయి ఎంపీపీ పాఠశాలలో శుక్రవారం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు చేతుల్లో జాతీయ పతాకాలను పట్టుకుని గ్రామంలోని వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు దేశభక్తిని, జాతీయతా భావాన్ని పెంపొందించేలా నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. జాతీయ పతాక ప్రాధాన్యతను తెలియజేస్తూ నిర్వహించిన ఈ ర్యాలీ గ్రామంలో ఆకట్టుకుంది. కార్యక్రమంలో తెంబూరు ప్రభుత్వ హోమియో వైద్యురాలు ఉమా గౌరి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్ఈబ్ల్యూపీపీల నిర్వహణ పక్కాగా ఉండాలి



**సారవకోట, ఆగస్టు 14(వార్త):** ఎస్ఈబ్ల్యూపీపీ (చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల) నిర్వహణ పక్కాగా ఉండాలని సారవకోట ఎంపీడీఓ మోహన్ కుమార్ అన్నారు. శుక్రవారం సారవకోట మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులకు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో సేకరించే తడి, పొడి చెత్తను తప్పనిసరిగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరచడంతో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. చెత్తను సక్రమంగా వేరు చేసి కేంద్రాలకు తరలించడం ద్వారా వ్యర్థాల నిర్వహణ సమర్థవంతంగా చేపట్టవచ్చని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ నిరంతర ప్రక్రియగా కొనసాగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సారవకోటలో ఘనంగా తిరంగా ర్యాలీ

**సారవకోట, ఆగస్టు 14(వార్త):** సారవకోట మండలంలో ఓ ప్రైవేట్ పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు జాతీయ జెండాలను చేతబూని దేశభక్తిని చాటుతూ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ సీఈఓ వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో దేశభక్తి భావన పెంపొందాలని సూచించారు. స్వాతంత్ర్యం సాధించి 80 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రజలంతా ఘనంగా జరుపుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని ఆయన పిలుపునిచ్చారు. జాతీయ జెండా పట్ల గౌరవం, దేశం పట్ల బాధ్యత భావనను చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌కుమార్, ఎంఈఓ రమణ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా నీలమణి దుర్గమ్మ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు



- శిష్టు కుటుంబీకుల ఆధ్వర్యంలో

ప్రత్యేక పూజలు, హోమాలు,

**పలాస, ఆగస్టు 14 (వార్త):** వజ్రపుకొత్తూరు మండలం మహాదేవిపురంలో నీలమణి దుర్గమ్మ అమ్మవారి పునఃప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శిష్టు కుటుంబీకుల ఆధ్వర్యంలో ఈ నెల 16వరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ప్రత్యేక పూజలు, హోమాలు, వేద కార్యక్రమాలు చేపడుతున్నారు. శిష్టు సారథినాయుడు, శిష్టు చిరంజీవి నాయుడు, శిష్టు ఎర్రంనాయుడు, డాక్టర్ శిష్టు మనోజ్‌కుమార్ నాయుడు దంపతులు బ్రహ్మశ్రీ బూరాడ ఆదిత్యశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, ప్రతిష్ఠా సంకల్పం, దీక్షాధారణ, యాగశాల సంస్కారాలు, అఖండ దీపారాధన, అంకురారోపణ కార్యక్రమాలు నిర్వహించారు. మహిళల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజ చేపట్టారు. సాయంత్రం అమ్మవారి గ్రామ ప్రదక్షిణ, అగ్ని ప్రతిష్ఠ, జలాధివాసం, వేదస్వస్తి, అష్టదిగ్బలి, నీరాజన, మంత్ర పుష్ప కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

**నేడు ప్రత్యేక పూజలు**

శనివారం ప్రాతఃకాల అర్చనలు, ప్రతిష్ఠాహోమాలు, మూలమంత్ర జపాలు, క్షీరాధివాసం, పంచామృతాధివాసం, ధాన్యాధివాసం, పంచశయ్యాధివాసం, చండీహోమం, ప్రసాద సంస్కారం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

**పునఃప్రతిష్ఠ**

ఆదివారం ప్రధాన పునఃప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం శాంతి హోమాలు, గర్తన్యాస, రత్నన్యాస, బీజన్యాస కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం సుముహూర్తంలో అమ్మవారి యంత్ర విగ్రహం, శిఖర ప్రతిష్ఠ, కళాన్యాసం, గోపృష్ఠదర్పణం, పూర్ణాహుతి, ప్రథమ పూజ, సర్వదర్శనాలు నిర్వహించనున్నారు.

మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులకు అన్నసమారాధన, 3 గంటలకు గీతాపారాయణం ఏర్పాటు చేసినట్లు శిష్టు సారథినాయుడు, శిష్టు చిరంజీవినాయుడు తెలిపారు. మహోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు, గ్రామపెద్దలు కోరారు

## ఇండియా ఆకృతిలో విద్యార్థుల వినూత్న ప్రదర్శన



- ఆకట్టుకున్న శ్రీ సత్యసాయి విద్యావిహార్ చిన్నారులు

**పలాస, ఆగస్టు 14 (వార్త):** స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని రామకృష్ణపురంలోని శ్రీ సత్యసాయి విద్యావిహార్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శుక్రవారం వినూత్న ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. పీఈటీ కిరణ్, సింహాచలం పర్యవేక్షణలో విద్యార్థులు క్రమశిక్షణతో కూర్చొని 'ఇండియా' ఆకృతిని రూపొందించారు. ఈ ప్రదర్శన వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారుల్లో దేశభక్తి, జాతీయ భావన, ఐక్యత, క్రమశిక్షణను పెంపొందించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు సమన్వయంతో తమకు కేటాయించిన స్థానాల్లో కూర్చొని ఆకృతిని రూపొందించడం చూపరులను ఆకట్టుకుంది. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, విద్యార్థుల సమష్టి కృషితో ప్రదర్శన విజయవంతం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా చిన్నారుల్లో దేశం పట్ల గౌరవం, బాధ్యతాభావం పెంపొందించేలా నిర్వాహకులు సందేశాన్ని అందించారు. విద్యార్థుల సృజనాత్మకత, క్రమశిక్షణను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

## న్యూఢిల్లీ స్వాతంత్ర్య వేడుకలకు అంబుగాం విద్యార్థిని షర్మిల



**మందస, ఆగస్టు 14(వార్త):** స్వాతంత్ర్య వేడుకలు మందస మండలంలోని అంబుగాం ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని పెద్దింటి షర్మిళ ఎంపికైంది. న్యూఢిల్లీ జరిగే స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలకు అంబుగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న షర్మిళ భారత్ లో వికసిత్ కృత్రిమ మేథ పాత అనే వ్యాసరచనలో 70వ స్థానం పొందింది. దేశవ్యాప్తంగా 14వేల మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. న్యూఢిల్లీ జరిగే స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలకు ఎంపికైన షర్మిళకు ఇప్పటికే ఆహ్వానం అందింది. విద్యార్థి షర్మిళ ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎ.సీతమ్మ, ఉపాధ్యాయులు సిబ్బంది అభినందనలు తెలిపారు. షర్మిళ తల్లిదండ్రులు భాస్కరరావు, లిఖిత ఆనందం వ్యక్తం చేశారు.

## యూరియా, విత్తనాలు ఏవయ్యా..?

- అధికారులను నిలదీసిన మండల సభ్యులు

**సంతబొమ్మాళి, ఆగస్టు 14(వార్త):** రెండేళ్లు కూటమి ప్రభుత్వంలో యూరియా, విత్తనాలు పంపిణీ పై రైతులు చాలా ఇబ్బందులకు గురయ్యారని రైతు సమస్యలు మీకు పట్టవా అంటూ జడ్పీటీసి పాల వసంత రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు మండిపడ్డారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మేరుగ రాజేశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ పై జరిగిన చర్చలో మండల వ్యవసాయ అధికారిని సభ్యులు నిలదీశారు. యూరియా పంపిణీలో ఒక బస్తా ఇచ్చి ఇద్దరు రైతులకు ఏ విధంగా సర్దుకోమని చెప్పారని మండల వ్యవసాయ శాఖ ఏఈఓ శ్రీధర్ ను స్థానిక జడ్పీటిసి పాలవసంత రెడ్డి నిలదీశారు. రైతులకు సరిపడు యూరియా ఇవ్వకపోతే ఏ విధంగా వ్యవసాయం చేస్తారని ప్రశ్నించారు. ఆక్వా రైతులను కూడా కూటమి ప్రభుత్వం మభ్య పెడుతున్నారని రొయ్యల కౌంట్ రేట్లు తెలియజేయడం లేదని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎప్పటికప్పుడు ఆక్వా రొయ్యల రేట్లు తెలిసేవని గుర్తు చేశారు. రైతుల మోసాలను ప్రజలు గమనిస్తున్నారని రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్తారని జడ్పీటిసి అన్నారు. రైతులకు సరిపడు విత్తనాలు కూడా పంపిణీ చేయలేదని, ఈ రెండేళ్లలో ఒక్క మోటారు కూడా రైతులకు సబ్సిడీపై ఇవ్వలేదని ఎంపీపీ మెరుగు రాజేశ్వరి మండిపడ్డారు. మత్స్య శాఖపై జరిగిన చర్చలో లక్కీ వలస పంచాయతి సంబంధించి 98 మంది మత్స్యకారులకు మత్స్యకార భరోసా పరిహారం పడలేదని ఎంపిటిసి చింతల రాజులు సభ దృష్టికి తెచ్చి వీరికి న్యాయం చేయాలని మత్స్య శాఖ టంశీ ధర్మరాజు పాత్రో ను కోరారు. దండు గోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది సమస్య వేధిస్తుందని ఒక డాక్టర్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ఆటెండర్ పోస్టు ఖాళీగా ఉందని ఎం పి హెచ్ సి ఓ నాగేశ్వరరావు సభ దృష్టికి తెచ్చారు. అర్హులందరికీ ఇల్లు సర్వే చేయాలని సభ్యులు కోరారు. దేశంలో పెద్ద పోర్టులో ఒకటైన మూలపేట పోర్ట్ పనులు మందకొడిగా సాగుతున్నాయని పనులు వేగవంతం చేసి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని జడ్పిటిసి పాల వసంత రెడ్డి కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో పార్వతీశం ఉన్నారు.




## బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**ఇచ్ఛాపురం, ఆగస్టు 14 (వార్త):** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు భారతీయ జనతా యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ముడియా రంగనాథ్ రెడ్డి నిర్వహణలో, ఇచ్ఛాపురం పట్టణ అధ్యక్షుడు సాలిన రేణు అధ్యక్షతన ఇచ్ఛాపురంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజలు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఇచ్ఛాపురం బిజెపి పట్టణ అధ్యక్షుడు సాలిన డిల్లీరావు, మహిళా మోర్చా అధ్యక్షురాలు సాలిన పద్మ ,జిల్లా కోశాధికారి వల్లంపాటి ప్రసాద్ , జిల్లా యువమోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్లు భైరిశెట్టి గోపి, సంతోష్ సాహు, పట్టణ యువమోర్చా ప్రధాన కార్యదర్శి నారాయణ, బిజెపి పట్టణ, మండల నాయకులు వాసురెడ్డి, భాస్కర్ రెడ్డి, రాజేశ్వరి, సునీత, పత్తి శ్రీను, కాళిదాసు, సాడి ధర్మా, మార్కండేయ, మద్దిలి సిన్నయ్య, సాలిన కూర్మయ్య, సాలిన మోహనరావు, పట్టణ యువమోర్చా నాయకులు ఉమ్మడి ఢిల్లీ, నీలాపు మహేష్, కస్పా ధర్మా, గుజ్జు శంకర్ తదితరులు పాల్గొన్నారు.




## వర్షం పడితే చాలు.. కరకవలస రహదారి చెరువే!

- రెండేళ్లుగా రోడ్డుపైనే వర్షపు నీరు -కాలువలు లేక ప్రజల అవస్థలు
- తక్షణమే డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని డిమాండ్

**జలుమూరు, ఆగస్టు 14(వార్త):** వర్షం పడితే చాలు.. జలుమూరు మండలం కరకవలస గ్రామంలోని ప్రధాన రహదారి చెరువును తలపిస్తోంది. చిన్నపాటి వర్షానికే రహదారిపై పెద్ద ఎత్తున నీరు నిలిచిపోతుండటంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత రెండేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో వర్షపు నీరు వెళ్లేందుకు సరైన కాలువలు లేకపోవడంతో మురుగునీరు, వర్షపు నీరు రహదారిపైనే నిలిచిపోతున్నాయి.



రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో దోమలు, విషసర్పాల బెడద పెరిగిందని స్థానికులు చెబుతున్నారు. దీంతో గ్రామంలో ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సుమారు 50 కుటుంబాలకు చెందిన వారు డెంగ్యూ తదితర అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని గ్రామస్థులు తెలిపారు. సమస్య పరిష్కారం కోసం గ్రామ యువత బొంగు ధనుంజయ్, పేరాడ నాగరాజు తదితరులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇంతవరకు శాశ్వత పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. పంచాయతీ అధికారులు, ఎంపీడీవోలకు పలుమార్లు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాకపోవడంతో గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కరకవలస గ్రామస్థులు సమస్యను ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకులు, శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి (2024) అయిన రాజశేఖర్, జలుమూరు మండలం కాంగ్రెస్ కార్యధర్శి మరియు శ్రీముఖలింగం మాజీ సర్పంచ్ అయిన గుంట కర్ణవీరుడు దృష్టికి తీసుకెళ్లాగ వారు జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించిన జిల్లా అధికారులు జలుమూరు ఎంపీడీవోకు సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా శాశ్వత ప్రాతిపదికన డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించి రహదారిపై నిలిచే వర్షపు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కరకవలస గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ప్రజా సమస్యల పరిష్కారమే తొలి ప్రాధాన్యత

**- కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్**

**- -వెల్లువెత్తిన వినతులు**

**- అర్జీలపై తక్షణ చర్యలకు అధికారులకు ఆదేశాలు**

**- ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం**

**- బగ్గు రమణమూర్తి, అర్చన**



**పోలాకి, ఆగస్టు 14(వార్త):** ప్రజా సమస్యల పరిష్కారమే తమ తొలి ప్రాధాన్యత అని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన తెలిపారు. పోలాకి మండలం కత్తిరివానిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వారు వినతులను స్వీకరించారు. ప్రజలు అందజేసిన ప్రతి వినతిపత్రాన్ని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి క్షుణ్ణంగా పరిశీలించారు. సమస్యలకు సంబంధించిన శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా దర్బార్‌కు వచ్చిన అర్జీలను నిర్దిష్ట కాలపరిమితిలోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములవుతూ, వారికి నిరంతరం అందుబాటులో ఉండటమే తమ ప్రాథమిక బాధ్యత అని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో ముందుంటామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పారదర్శకత, వేగం పెంచాలని అధికారులను కోరారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి వినతికి సంబంధించిన పురోగతిని క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజా దర్బార్‌కు ప్రాధాన్యత ఇస్తున్నామని నాయకులు పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

## శ్రీముఖలింగంలో నేడు ఘనంగా 80వ స్వాతంత్ర్య వేడుకలు

**- కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి**



**జలుమూరు, ఆగస్టు 14 (వార్త):** స్వాతంత్ర్య దినోత్సవాన్ని శనివారం ఉదయం 8 గంటలకు శ్రీముఖలింగంలోని రాజీవ్ భవన్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు నాయుడుగారి రాజశేఖర్, జలుమూరు మండల కాంగ్రెస్ కార్యదర్శి, శ్రీముఖలింగం గ్రామ మాజీ సర్పంచ్ గుంట కర్ణవీరుడు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని వారు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ ముంధుస్తు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, డీసీసీ నాయకులు, నియోజకవర్గ నాయకులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరై వేడుకలను విజయవంతం చేయాలని నాయుడుగారి రాజశేఖర్, గుంట కర్ణవీరుడు కోరారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను దేశభక్తి, జాతీయ స్ఫూర్తితో ఘనంగా నిర్వహించేందుకు కాంగ్రెస్ శ్రేణులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు తెలిపారు.



## ఇచ్ఛాపురం వాసికి రెండు ప్రతిష్టాత్మక అవార్డులు

**ఇచ్ఛాపురం, ఆగస్టు 14 (వార్త):** 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని మదర్ తెరిసా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్లలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇచ్ఛాపురానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త పాతిర్ల గిరిబాబు రెడ్డిని ట్రస్ట్ చైర్మన్, ఫౌండర్ చిట్టా రవి ప్రకాష్ రెడ్డి ఘనంగా సన్మానించి రెండు ప్రతిష్టాత్మక అవార్డులను అందజేశారు. ది రెడ్ హీరో -2026 అవార్డు, మదర్ తెరిసా సేవా రత్న -2026 అవార్డులను అందజేశారు. అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడేందుకు తన అరుదైన ఏ- నెగెటివ్ రక్తాన్ని 20 సార్లు దానం చేశారు.



# రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలి

**- తక్కువ నీటి వినియోగం పంటలు పండించాలి**

**-ఫారంపాండ్స్ నిర్మించుకోవాలి**

**-అంతర పంటలపై దృష్టి సారించాలి**

**- పంటల బీమా చేసుకోవాలి**

**-క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన**

**- జిల్లా వ్యవసాయ, ఉద్యానవన నిపుణుల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన, శిక్షణ**




**మందస, ఆగస్టు 14(వార్త):** ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు అప్రమత్తంగా ఉండాలని, తక్కువ నీటి వినియోగంతో పండే పంటలను పండించుకోవాలని శ్రీకాకుళం జిల్లా వ్యవసాయశాఖ, ఉద్యానవనశాఖ, ఆముదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం నిపుణులు సూచించారు. ఎల్ నినో సందర్భంగా రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పలాస అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ శారద, కేవీకే ఆముదాలవలస కీటక శాస్త్ర నిపుణురాలు ఎస్.అనూష, పలాస ఉద్యానశాఖధికారి. సీహెచ్ శంకర్ దాస్, ఏఓ పాపారావు, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు. ఉద్యాన శాఖాధికారి సీహెచ్ శంకర్ దాసు మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం దృష్టిలో పెట్టుకొని రైతుల తీసుకోవాల్సిన ముందుస్తు జాగ్రత్తలు తెలిపారు. ముఖ్యంగా నీటి వసతి ఉన్న రైతులు ఫారం పౌండ్స్ అంటే నీటి కుంటలు, డ్రిప్పు స్ప్రింక్లర్ ఇరిగేషన్ ద్వారా ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలన్నారు. అదేవిధంగా వర్షాధారం మీద పండించేవారితో రైతులు తప్పనిసరిగా , పీఎండిఎస్ కిట్స్ గాని, లేదంటే ఉలవలు, కందులు, గంటెలు, జినుగులు తదితర అంతర పంటలు వేసుకొని, పదును పోకుండా జాగ్రత్త పడాలని చెప్పారు. ప్రతీ రైతు తప్పనిసరిగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్, ఈ పంట నమోదు అనేది ఈ మూడు విషయాలు కంపల్సరిగా రైతులందరూ చేస్తున్నట్లయితే, ప్రభుత్వం నుండి వచ్చే నష్టపరిహారం అందుతుందని వివరించారు. అగ్రికల్చర్ ఏడీ శారద మాట్లాడుతూ అగ్రికల్చర్ పంటల్లో ప్రధానంగా వరిలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అదేవిధంగా ప్రతీ రైతు అంతర పంటలు, పీఎంఎస్ గిఫ్ట్ వాడకం, ఇన్సూరెన్స్ అనేది అందరూ కూడా చేసుకోవాలన్నారు. అదేవిధంగా వ్యవసాయ విషయాలు, వ్యవసాయం సంబంధిత సమాచారాన్ని కూడా తెలిపారు. కీటక శాస్త్ర నిపుణురాలు అనూష మాట్లాడుతూ ప్రస్తుతం జీడి, మామిడి, కొబ్బరి పంటల్లో, ఉద్యాన పంటల్లో ఉన్నటువంటి ప్రధానంగా జీడిలో వేరు, కాండం తొలుచు పురుగు, సంబంధిత సత్యశ్చారం సంబంధించిన సస్యరక్షణ చర్యలు ఏ విధంగా చేయాలి.. కొబ్బరిలో కొమ్ము పురుగు, వాటికీ సంబంధించిన సస్యరక్షణ చర్యలు ఏ విధంగా తీసుకోవాలి అనే విషయాలను అవగాహన కల్పించారు. మొక్క నాటే దగ్గర నుంచి పునరుద్ధరణ పథకం, పంట పూత పిందె దశలో ఉన్నప్పుడు ఎలాంటి జాగ్రత్త తీసుకోవాలి అనే వాటిపైన కూలంకుషంగా తెలిపారు. పొలం కోసిన ఉపయోగాలు, క్షేత్రస్థాయిలో ఫీల్డ్ విజిట్ కూడా చేసి రైతులకు డెమో ద్వారా పురుగులు ఎలా అరికట్టాలో తెలిపారు. రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం నుండి జీడి అంటు మొక్కలు, అదేవిధంగా నీటి వసతికి సంబంధించి బోరుబావులు వసతిలను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో శిక్షణ పొందిన రైతులకు ట్రైనింగ్ సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమానికి సంబంధించిన వివరాలతో కూడిన పాంప్లెట్స్ పత్రాల్ని, లిటరేచర్ రైతులకు పంపిణీ చేశారు.

# ఆద్యంతం అలరించిన ఫ్రెషర్స్ డే వేడుకలు





**సోంపేట, ఆగస్టు 14(వార్త):** సోంపేటలోని కొంచాడ రాజేశ్వరరావు జూనియర్ అండ్ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకలు ఆద్యంతం అందరినీ అలరించాయి. అతిథుల స్వాగత కార్యక్రమాల నుంచి మొదలుకొని చివరిగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాల వరకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా కార్యక్రమాన్ని వీక్షించారు. కళాశాలల చైర్మన్ కొంచాడ సూర్య ప్రతాప్, కరస్పాండెంట్ కొంచాడ శేషాద్రి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సోంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. మంగరాజు హాజరయ్యారు.

### ఉన్నత భవిష్యత్తు లక్ష్యం కావాలి

ఇంటర్మీడియట్ మొదలుకొని ఉన్నత విద్యల్లో అత్యున్నతంగా రాణిస్తూ బంగారు భవిష్యత్తు లక్ష్యంగా విద్యార్థులు ఎదగాలని కళాశాల యాజమాన్య ప్రతినిధులు సూర్య ప్రతాప్, శేషాద్రి కోరారు. ఈరోజు ఈ కార్యక్రమంలో ఉన్న ఉత్సాహం, ఉల్లాసం చదువుల్లో కూడా కొనసాగిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తూ భవిష్యత్తులో మంచి అవకాశాలు సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని పేర్కొన్నారు. ఇప్పటినుంచి చదువులను ప్రణాళిక బద్ధంగా కొనసాగిస్తూ ప్రతిరోజు కళాశాలలో చదివే పాఠాలను ఇంటి వద్ద కూడా సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. సరదాలు, షికారులకు ప్రాధాన్యత తగ్గించి చదువే సర్వస్వం అన్నట్లుగా విద్యార్థులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

### మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దు

విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిఐ మంగరాజు పిలుపునిచ్చారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలతో యువత జీవితం నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఇటువంటి అలవాట్ల జోలికి వెళ్లడం ద్వారా కఠినమైన చట్టాలు చూస్తూ ఉపేక్షించవని హెచ్చరించారు. బంగారు భవిష్యత్తు కోసం కలలు కంటూ వాటిని సార్థకం చేసుకునే ప్రయత్నం చేయాలని సిఐ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గత ఏడాది చదువుల్లో మంచి ప్రతిభ, పాఠవాలు ప్రదర్శించిన విద్యార్థులకు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కింతలి తేజేశ్వర రావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గున్న జయశంకరం బహుమతులను, జ్ఞాపికలను అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అలరించాయి. సినీ సంగీతానికి విద్యార్థులు వేసిన స్టెప్పులతో వేదికను అదరగొట్టారు.

# మందస మండల సమావేశాన్ని బహిష్కరించిన ఎంపీటీసీలు

**- గౌరవ వేతనాలు చెల్లించకపోవడంతో నిరసన**

**- న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరిక**



**మందస, ఆగస్టు 14(వార్త):** మందస మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నాటకీయంగా ముగిసింది. ఎన్నడూలేని విధంగా సమావేశం జరుగక ముందే సభ్యులు బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. వైస్ ఎంపీపీ సీర ప్రసాద్ మాట్లాడుతూ గత సమావేశంలోనే తమ గౌరవ వేతనాలు చెల్లించలేదని అధికారులకు చెప్పడం జరిగిందని, నేటికీ చెల్లించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకుంటున్నామన్నారు. ఇంకో నెల రోజుల మాత్రమే సభ్యుల పదవీకాలం ఉందని, గౌరవ వేతనాలు చెల్లించకపోవడంతో కోర్టును ఆశ్రయించనున్నట్టు చెప్పారు. సంవత్సరాల తరబడి బకాయిలు ఉన్నటువంటి ఎంపీటీసీల గౌరవ వేతనాలు తక్షణమే చెల్లించాలంటూ పలు నినాదాలు చేస్తూ మండల పరిషత్ సమావేశ మందిరం బయట నిరసన వ్యక్తపరిచారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నప్పటికీ తమకు రావలసిన గౌరవ వేతనాలు అంధక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తపరిచారు. ప్రభుత్వం తమ సమస్యలను నిర్లక్ష్యం చేస్తుందన్నారు. పెండింగ్ లో ఉన్న గౌరవ వేతనం బకాయిలను తక్షణమే చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేనట్లయితే న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, వైస్ ఎంపీపీలు సీర ప్రసాద్, కొర్నాన ఆదినారాయణ, జడ్పీటీసీ సవర చంద్రమ్మ, ఎంపీటీసీలు కంచిబెహరా, ఆనల అప్పన్న, వాయలపల్లి మాధవరావు, సవర ఢిల్లేశ్వరి, సీర లోకనాథ్, మట్ట లక్ష్మమ్మ, సుశీలమల్లికో, సవర కాంచన తదితరులు పాల్గొన్నారు.

## శివాలయంలోకి మురుగునీరు

**- కాలువల ఆక్రమణలతో ఇబ్బందులు**

**- అధికారులు స్పందించాలని స్థానికుల వినతి**



**నరసన్నపేట, ఆగస్టు 14 (వార్త):** గొట్టిపల్లి పంచాయతీ పరిధిలోని శివాలయంలోకి మురుగునీరు చేరుతుండటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆలయం పక్కన ఇళ్ల నిర్మాణాలు చేపడుతూ కాలువలను ఆక్రమించుకోవడంతో మురుగునీరు వెళ్లేందుకు మార్గం లేక నేరుగా ఆలయ ప్రాంగణంలోకి చేరుతోందని ఆలయ అర్చకులు వాసనాభి హేమ తెలిపారు. మురుగునీరు శివాలయంలోకి చేరుతుండటంతో ఆలయానికి వచ్చే భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అపరిశుభ్ర వాతావరణం ఏర్పడటంతో పాటు ఆలయ పవిత్రతకు భంగం కలుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన ప్రాంతాలను అధికారులు పరిశీలించి, ఆక్రమణలను తొలగించి మురు గునీటి సక్రమ పారుదలకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఆల యంలోకి మురుగునీరు చేరకుండా శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

## నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి

**-గిరిజన ప్రాంతాల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలి**

**- సత్యవరం జంక్షన్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు సీపీఐ ర్యాలీ**




**నరసన్నపేట, ఆగస్టు 14 (వార్త):** నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంతో పాటు గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే దృష్టి సారించి చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నరసన్నపేట సత్యవరం జంక్షన్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకూ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. యువతకు తగిన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అన్నారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు, ఇతర ప్రజా సమస్యలపై ప్రభుత్వాలు సమగ్రంగా దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు ఉపాధి అవకాశాలను పెంచాలని సీపీఐ నాయకులు కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీపీఐ నాయకులు, సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కూటమితోనే అభివృద్ధి సాధ్యం : అనపాన



**మెళియాపుట్టి, ఆగస్టు 14 (వార్త):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంతోనే అన్ని రంగాలలో అభివృద్ధి సాధ్యమని తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ ఆర్గనైజింగ్ కార్యదర్శి అనపాన రాజశేఖర్ రెడ్డి తెలియజేస్తున్నారు. మెళియాపుట్టిలోని బూత్ నెంబర్ 100, 101, 102,0 103లలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పరిపాలనపై ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని శుక్రవారం నాడు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు తదితర అంశాలపై ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తెలియపరచడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలలో అర్హులైన ప్రతి ఒక్కరుకి చేరేలా ప్రజలతో నేరుగా మమేకమై, వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకొని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ ఇంటింటికి ప్రసార కార్యక్రమంలో ఆయనతోపాటు మండల ఐటీడీపీ అధ్యక్షులు దుక్క శంకర్ రెడ్డి, సీనియర్ టీడీపీ నాయకులు ఓట్టికుళ్ల చక్రి, హరికృష్ణ, దేవ స్థానిక ప్రజలు, మహిళలు తదితరులున్నారు.

## పీఏసీఎస్ ఆధ్వర్యంలో డీఏపీ పంపిణీ

**ఇచ్ఛాపురం, ఆగస్టు 14 (వార్త):** కీర్తిపురం, పాయితారి, కొలిగం, బొడ్డబడ గ్రామ పంచాయతీ రైతులకు యూరియా ,డి ఏ పి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు లోపింటి పద్మనాభం పి ఏ సి ఎస్ డైరెక్టర్ గిన్ని బాలరాజు ,ప్రకాశ్ చంద్ర నాయక్, లెంక మురళికృష్ణ, వలపల నరహరి ,అగ్రికల్చర్ అధికారి జీవనజ్యోతి రైతులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# పలాసను ఆదర్శ నియోజకవర్గం చేస్తా

- ఎమ్మెల్యే శిరీష
- పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- సామాజిక భవనాలు ప్రారంభం, జలజీవన్ మిషన్‌తో తాగునీటి వసతి



**పలాస, ఆగస్టు 14 (వార్త):** పలాస నియోజవర్గాన్ని ఆదర్శ నియోజవర్గంగా చూపిస్తానని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించే లక్ష్యంతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. పలాస మండలం గురుదాసుపురం సాయినగర్ కాలనీలో రూ.5 లక్షల నిధులతో నిర్మించిన సామాజిక భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు. అనంతరం చిన్న గురుదాసుపురం గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మించిన మరో సామాజిక భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భవనాన్ని పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. అనంతరం చిన్న గురుదాసుపురం గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం కింద నిర్మించనున్న ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్‌కు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక భవనాల ఏర్పాటుతో గ్రామాల్లో ప్రజలకు వివిధ సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు సౌకర్యం కలుగుతుందన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటి వసతిని మెరుగుపరిచి గ్రామీణ ప్రజల నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, పలాస నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తామని గౌతు శిరీష పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో గ్రంథాలయ చైర్మన్ వీరికట్ల విఠల్, టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుమ్ లక్ష్మణ్, టిడిపి పార్టీ కార్యదర్శి సంతోష్ నాయుడు, పలాస పిఎసిఎస్ అధ్యక్షులు వంకల కూర్మారావు, మురిపింటి కుమార్‌రాజు, సవర సోమేశ్వరరావు, జినగ ధర్మారావు, పురుషోత్తం జోగారావు, అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## కళాకారులకు పింఛను మంజూరు చేయాలి



**ఇచ్ఛాపురం, ఆగస్టు 14 (వార్త):** కళాకారుల కు పింఛన్లు మంజూరు చేయాలని రాష్ట్ర నాటక పరిషత్ డైరెక్టర్ దక్కత కామేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బెందాలం అశోక్ కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి దక్కత ఢిల్లీ రావు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన తెలుగుదేశం నాయకులు




**ఇచ్ఛాపురం, ఆగస్టు 14 (వార్త):** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రీన్ కవర్ (పచ్చదనం) శాతం పెంపొందించడానికి ఇటీవల మున్సిపల్ కార్యాలయం నకు వివిధ మొక్కలు చేరుకున్నాయి. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో మున్సిపల్ కమిషనర్ ఎన్ రమేష్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా పార్టీ ఆదేశాలు మేరకు తెలుగుదేశం పట్టణ అధ్యక్షుడు పత్రి తవిటయ్య,ఎన్ కోటేశ్వర రావు, రాష్ట్ర కార్యదర్శి సాలీనా ఢిల్లీ, ప్రిన్సిపాల్ నవ్యశ్రీ మహంతి ఆసి లీలా రాణి, జన్నెల సంతోష్, రంగాల శ్రీను,ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు స్వాతంత్ర్య వేడుకలు



**ఇచ్ఛాపురం, ఆగస్టు 14 (వార్త):** కొలిగాంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో సైకిల్ ర్యాలీ నిర్వహించి గ్రామ ప్రజలకు 80 వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం. ప్రమీల కుమారి , విద్యాకమిటీ చైర్మన్ శ్రీకాంత్ మహంతి, ఉపాధ్యాయులు నరేంద్ర నాథ్ పట్నాయక్, చంద్ర వదన రామ్మోహన్ రావు, భాస్కర్, మిన్ను, నీలిప్, ధర్మరాజు, శ్రీనివాస్ పూండి, రేణుక రాజ్యలక్ష్మి, భవాని, అమిత, స్వప్నారాణి సుప్రభ, కోటేశ్వర రావు పాల్గొన్నారు.ప్రభుత్వ జూనియర్ కళాశాల( బాలికలు) లో స్వాతంత్ర దినోత్సవ ముందస్తు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు ప్రిన్సిపాల్ నవ్య శ్రీ మహంతి ఏజీఎంఓ ప్రియా సుధాకర్ ఎన్ఎస్ఎస్ పీవో ఎస్ రజనీకుమారి తదితరుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.



## స్వాతంత్ర్య వెలుగులు

**వజ్రపుకొత్తూరు/మందస, ఆగస్టు 14(వార్త):** ప్రభుత్వ కార్యాలయాలకు స్వాతంత్ర్య వేడుకల శోభ వచ్చింది. వజ్రపుకొత్తూరు మండల డీఆర్డీఏ వెలుగు కార్యాలయానికి విద్యుత్ దీపాలు సందడి చేశాయి. 80వ స్వతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని రంగు,రంగుల విద్యుత్ దీపాలతో కార్యాలయంను అలంకరించినట్లు డి.ఆర్.డి.ఎ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ గొడబ ప్రసాదరావు తెలిపారు. వెలుగు కార్యాలయం విద్యుత్ దీపాలతో స్థానికులను ఆకట్టుకుంది.



# ఐటీడీఏ బంకులో ఆన్‌లైన్ పేమెంట్లు

- యధావిధిగా ఫోన్ పే లావాదేవీలు
- జాతీయ వార్త కథనంపై స్పందన
- ఫోన్ పే బోర్డుల ఏర్పాటు



**హిరమండలం, ఆగస్టు 14(వార్త):** హిరమండలం పరిధిలో ఉన్న ఐటీడీఏ ఫిల్లింగ్ స్టేషన్ ( పెట్రోల్ బంక్ ) నందు గత నెల రోజుల నుంచి ఫోన్ పే లేకుండా ఓన్లీ క్యాష్ కే పెట్రోల్ డీజిల్ దొరుకుతుందని అక్కడ సిబ్బంది చెబుతున్నారని పలువురు వాహన చోధకులు జాతీయ వార్త దృష్టికి గురువారం తీసుకువచ్చారు. దీనిపై హిరమండలం ఐటిడిఏ స్టేషన్ నందు నో ఫోన్ పే, ఓన్లీ క్యాష్ అంటూ బోర్డులను ఏర్పాటు చేశారని దీనివలన వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని శుక్రవారం జాతీయ వార్తలో ప్రచురించడం పై సంబంధిత అధికారులు కలుగజేసుకొని శుక్రవారం సాయంత్రం నుంచి యధావిధిగా ఫోన్ పే లావాదేవీలు కొనసాగిస్తున్నారు. ఐటీడీఏ ఫిల్లింగ్ స్టేషన్ నందు ఫోన్ పే ద్వారా లావాదేవీలు ఇలాగే కొనసాగించాలని పలువురు వాహన ధారులు కోరుతున్నారు



## పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలి

**సోంపేట, ఆగస్టు 14 (వార్త):** పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని కాశీబుగ్గ ఫారెస్ట్ రేంజ్ అధికారి అమ్మన్ నాయుడు పేర్కొన్నారు. అటవీ శాఖ ఉప అధికారి దేవరాజు తో కలిసి శుక్రవారం కంచిలి మండలం ఎమ్మెస్ పల్లి గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొని పాఠశాల ఆవరణతో పాటు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కిషోర్ కడంగా, ప్రమోద్ కుమార్ పాడీ తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర సమరయోధుల త్యాగం వృధా కాకూడదు

-ఘనంగా హర్ ఘర్ తిరంగా -బీజేపీ నేత శరత్‌కుమార్



**మెళియాపుట్టి, ఆగస్టు 14(వార్త):** స్వాతంత్ర వేడుకలు పురస్కరించుకొని మెళియాపుట్టిలో శుక్రవారం ప్రతి దుకాణంకు మువ్వలు జెండాని ఇచ్చి జెండాను ప్రతి ఇంటి మీద, ప్రతి దుకాణల మీద కట్టాలని పుర ప్రజలను కోరుతూ స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను మరవకూడదని అనేక అంశాలను బిజెపి సీనియర్ పార్టీ నాయకులు డాక్టర్ సలాన శరత్ కుమార్ తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా, మెళియాపుట్టి పంచాయతీ కార్యదర్శి కిషోర్, భారతీయ జనతా బిజెపి సీనియర్ నాయకులు సలాన రాఘవరావు, భూపతిరావు, రమేష్ చంద్రనాయక్, బోచ్చు పాపారావు, కార్యకర్తలు, ప్రజలు, గ్రామస్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# త్రివర్ణ శాఖాంబరిగా బారువా దుర్గమ్మ



**సోంపేట, ఆగస్టు 14 (వార్త):** శ్రావణమాసం పవిత్రంగా భావించే తొలి శుక్రవారం నాడు బారువలో వెలసిన శ్రీ కనక దుర్గమ్మ త్రివర్ణ శాఖాంబరిగా దర్శనమిచ్చింది. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శనివారం స్వాతంత్ర దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకొని త్రివర్ణ పతాకం స్ఫురించేలా మూడు రంగులతో కూడిన కాయగూరలను అమ్మవారికి దండలుగా అలంకరించారు. కాషాయ రంగులో ఉన్న క్యారెట్లు, తెలుపు రంగులో ఉన్న ముల్లంగి దుంపలు, పచ్చని రంగులో ఉన్న బెండకాయలను అమ్మవారికి అలంకరించి శాఖంబరిగా తీర్చిదిద్దారు. ఈ అలంకరణ ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంది. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ ప్రత్యేక అలంకరణ అందరిని ఆకర్షించింది. కమిటీ సభ్యులను అనేకమంది అభినందించారు.

## కాము మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



**సోంపేట, ఆగస్టు 14(వార్త):** పర్యావరణ పరిరక్షణ కోసం కాము మొక్కలు ఎంతగానో దోహద పడతాయని పర్యావరణ ప్రేమికుడు, ఎం జె పూలే రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు బీన ఢిల్లీరావు పేర్కొన్నారు. బారువ కంభ నుంచి పలాసపురం వరకు రోడ్డుకు ఇరువైపులా శుక్రవారం కాము విత్తనాలను పలువురు సభ్యులతో కలిసి చల్లారు. ప్రస్తుత నేలపదును వాతావరణం లో చెదురు మధురు వర్షాలకు విత్తనాలు మొలకెత్తి చక్కగా పెరిగే అవకాశం ఉంటుందని అన్నారు. రోడ్డు ప్రక్కన ఇటువంటి కాము చెట్లు పెరగడం ఎంతో మంచిదని అన్నారు. జంతువుల వల్ల ఈ మొక్కలకు ఎటువంటి హాని ఉండదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గేదెల దేవరాయలు, తుంగాన రాజు, ఇంటి వెనుక భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# అప్పలరాజుకు బెయిల్.. వైసీపీ కేడరులో ఉత్సాహం

-శ్రీకాకుళం తరలివెళ్లిన

మందస నాయకులు



**మందస, ఆగస్టు 14(వార్త):** మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు బెయిల్ మంజూరయ్యింది. కుమారుడి ప్రమాద ఘటన కేసులో పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. 23రోజులుగా శ్రీకాకుళం జిల్లా అంపోలు జైలులో ఉన్న అప్పలరాజుకు శుక్రవారం న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. ఆయన రాకకోసం ఎదురు చూస్తున్న పార్టీ శ్రేణులకు ఈ సమాచారం రెట్టిం పు ఉత్సాహం ఇచ్చింది. అప్పలరాజుకు బెయిల్ అన్న వార్త క్షణాల్లోనే సోషల్ మీడియాలో వ్యాపించింది. సుమారు నెల రోజులుగా అప్పలరాజు కుటుంబం అనుభవిస్తున్న కష్టాలకు విముక్తి కలిగినట్టయింది. శ్రావణ శుక్రవారం రోజున సీదిరికి బెయిల్ మంజూరు కావడం శుభసూచికంగా పార్టీ కేడరు చెప్పుకుంటూ, భారీగా అప్పలరాజును చూడడానికి అంపోలు తరలివెళ్లారు. మందస మండలంలోని ఉద్ధానం, పల్లం, మైదాన, గిరిజన ప్రాంతాల నుంచి ఉల్లాసంగా.. ఉత్సాహంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రయాణం సాగించారు. మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు జైలు నుంచి బయటకు రాగానే అప్పలరాజుతో కరచాలనం చేయడానికి ఉత్సాహం చూపించారు. సెల్ఫీలు తీసుకోవడానికి పోటీ పడ్డారు. న్యాయం గెలిచిందని సోషల్ ట్రోల్ చేశారు. అంపోలు నుంచి కాశీబుగ్గ అప్పలరాజు వచ్చేవరకు కూడా ఆయన వాహన శ్రేణితో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కొనసాగారు. తమ అభిమాన నాయకునికి బెయిల్ లభించడంతో వారంతా ఆనందం వ్యక్తం చేశారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546